సాక్షి నారాయణపేట

మంగళవారం : 1 : జూలై : 2025



విహారం.. విరామం!

ఫర్హాబాద్ జంగల్ సఫారీకి సెప్టెంబర్ 30 వరకు తాత్కాలిక విరామం ఇచ్చారు.

వివరాలు 8లో ▸



కనిపించే దైవం

ఆపదలో ఉన్న వారికి తమ వైద్యంతో పునర్జన్మనిస్తున్నారు డాక్టర్లు.

వివరాలు 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
35.5 /22.6

వాతావరణం

అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతం అవుతుంది. మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

3న ఇంజినీరింగ్ ప్రవేశాలపై ఫోన్ ఇన్

కోస్గి రూరల్: కోస్గి ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాలలో ప్రవేశాల నిమిత్తం ఈ నెల 3న ప్రత్యేక ఫోన్ ఇన్ కార్యక్రమం చేపట్టనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసులు తెలిపారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. ఎంసెట్–2025 ఫలితాలు, మార్కులు, కళాశాలల సమాచారం, కోర్సులు మొదలైన వాటిపై సందేహాలను నివృత్తి చేసేందుకు 3వ తేదీన ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రత్యేక ఫోన్ ఇన్ చేపట్టనున్నామని తెలిపారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సెల్ నం.9848848802, 8096907524లలో సంప్రదించాలని సూచించారు.

బాలుర వసతి గృహంలో డీపీఆర్వో బస



కోస్గి రూరల్: జిల్లా అధికారుల ఆదేశాల మేరకు గుండుమాల్‌లోని ఎస్సీ బాలుర వసతి గృహంలో జిల్లా పౌరసంబంధాల శాఖ అధికారి రషీద్ సోమవారం రాత్రి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈమేరకు హాస్టల్‌లో ఆహార నాణ్యత, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, వసతిగృహ పరిసరాల్లో పారిశుద్ధ్యం, వంటశాలను పరిశీలించారు. హాస్టల్ నిర్వహణపై విద్యార్థులతో ఆరా తీశారు. ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని, ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేసి వారితోపాటు హాస్టల్‌లో రాత్రి బస చేశారు. ఆయనతోపాటు వార్డెన్ యాదయ్య ఉన్నారు.

175 ఎంబీబీఎస్ సీట్లకు ఎన్ఎంసీ అనుమతి

పాలమూరు: మహబూబ్‌నగర్ ప్రభుత్వ మెడికల్ కళాశాలకు 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఎంబీబీఎస్‌లో ప్రవేశాల కోసం 175 సీట్లు మంజూరు చేస్తూ ఎన్ఎంసీ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో కళాశాలలో పర్యటించిన ఎన్ఎంసీ బృందం పలు లోపాలు ఉన్నట్లు నోటీసులు జారీ చేయడంతో దీనికి సదరు అధికారులు లోపాలపై ఇచ్చిన నివేదికపై సంతృప్తి చెందిన ఎన్ఎంసీ సీట్లు జారీ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ప్రస్తుతం కళాశాలలో ఉన్న సమస్యలను రాబోయే నాలుగు నెలల వ్యవధిలో పరిష్కరించుకోవాలని ఎన్ఎంసీ ఆదేశించింది.

ఆర్టీసీ అభివృద్ధికి కష్టపడి పనిచేయాలి



స్టేషన్ మహబూబ్‌నగర్: ఆర్టీసీ సంస్థ అభివృద్ధి కోసం ఉద్యోగులు కష్టపడి పనిచేయాలని డిప్యూటీ రీజినల్ మేనేజర్ లక్ష్మీధర్మ అన్నారు. జిల్లాకేంద్రంలోని డిపోలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌లకు సోమవారం త్రైమాసిక అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులను మిగతా వారు స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. ఆర్టీసీలో ప్రమాదాల శాతాన్ని తగ్గించాలని సూచించారు. ఆర్టీసీ టూర్ ప్యాకేజీలకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని, మీ అనుకూలమైన సమయాల్లో వీటి గురించి గ్రామాల్లో, కాలనీల్లో ప్రచారం చేయాలని కోరారు. టూర్ ప్యాకేజీల వల్ల అదనపు ఆదాయం సమకూరే అవకాశం ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో టూటౌన్ సీఐ ఎజాజుద్దీన్, డిపో మేనేజర్ సుజాత, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

కోయిల్‌సాగర్ @ 20.6 అడుగులు

దేవరకద్ర: కోయిల్‌సాగర్ నీటిమట్టం సోమవారం సాయంత్రం వరకు 20.6 అడుగులకు చేరింది. కోయిల్‌సాగర్ ఎత్తిపోతల పథకంలో భాగంగా జూరాల నుంచి ఒక పంపును రన్ చేసి నీటి విడుదలను కొనసాగిస్తున్నారు. నెల రోజులుగా ప్రాజెక్టులోకి వస్తున్న నీటితో రోజుకు కొంత మేర నీటి మట్టం పెరగుతుంది. జూరాల నుంచి నీరు రాక ముందు 11అడుగులుగా ఉన్న నీటిమట్టం 9.6 అడుగులు పెరిగి 20.6 అడుగులకు చేరింది. పాత అలుగు స్థాయి 26.6 అడుగులు ఉండగా మరో 6 అడుగుల నీరు చేరితే పాత అలుగు స్థాయికి నీటిమట్టం చేరుతుంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి గేట్ల లేవల్ వరకు నీటి మట్టం 32.6 అడుగులు ఉండగా మరో 12 అడుగుల నీరు చేరితే పూర్తిగా నిండుతుంది.



చిత్రంలో కనిపిస్తున్న మురుగుకుంట జిల్లా కేంద్రంలోని బీసీ కాలనీలోనిది. హనుమాన్ మందిర్ ఎదుట డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగు, వర్షపునీరు చేరి ఇలా కుంటగా మారింది. బీసీ కాలనీ పైభాగం నుంచి వచ్చే మురుగు, వర్షపు నీరు అక్కడ చేరి గుంతలా మారింది. దీంతో పందులు దీనిని స్థావరంగా చేసుకున్నాయి. అటుగా వెళ్లాలంటేనే ముక్కు మూసుకొనే పరిస్థితి నెలకొంది. పరిస్థితి ఇంత అధ్వానంగా మారినా పట్టించుకునే అధికారే కరువయ్యారని పట్టణ **వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.**



ఇక్కడ కనిపిస్తున్న చిత్రం జిల్లా కేంద్రంలోని అశోక్‌నగర్‌లోనిది. మెయిన్ డ్రైయినేజీకి అంతర్గత డ్రైయినేజీని కలపడంతో వర్షం వచ్చినప్పుడు చెత్తాచెదారంతో ఈ డ్రైయినేజీ నిండుకొని మురుగు ముందుకు పారకుండా నిలిచిపోతుంది. రోజుల తరబడి ఇలాగే మురుగు నిండుకోవడంతో ఆ పరిసరాలు దుర్గంధభరితంగా మారుతున్నాయి. దీంతో సమీపంలోని 30 గృహాలవారు కంపుతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా మెయిన్ డ్రైయినేజీకి కలుపుతూ నూతన డ్రైనేజీని నిర్మించాలని **కాలనీ**వాసులు కోరుతున్నారు.

పారిశుద్ధ్యం.. అస్తవ్యస్తం

'పేట' పురపాలికలో వర్షానికే నిండుతున్న డ్రెయినేజీలు

- రోడ్లపై మురుగుతో కంపుకొడుతున్న కాలనీలు
- పందుల స్వైర విహారం.. దోమల బెడద తీవ్రం
- పొంచి ఉన్న సీజనల్ వ్యాధుల ముప్పు



జిల్లా కేంద్రంలో రోడ్లపై పారుతున్న వర్షపునీరు

నారాయణపేట: జిల్లా కేంద్రమైన నారాయణపేట మున్సిపాలిటీలో పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. నగరంలో ఎక్కడ చూసినా మురుగు నీరే దర్శనమిస్తోంది. మున్సిపల్ అధికారుల పర్యవేక్షణ లోపం, పట్టింపు లేని సిబ్బంది కారణంగా పారిశుద్ధ్య లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. చిన్నపాటి వర్షానికే డ్రెయినేజీలు నిండి మురుగు రోడ్ల పైకి వస్తోంది. దీంతో రోడ్లన్నీ కంపు..కంపు కొడుతున్నాయి. ఇళ్ల మధ్య నిలిచే మురుగు.. పందులు, దోమలకు ఆవాసాలు మారుతున్నాయి. ఇంత జరుగుతున్నా సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోవడంలేదని ప్రజలు మండిపడుతున్నారు. జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారులతోపాటు పలు కొత్త కాలనీల్లోని రోడ్లపై నిత్యం మురుగు పారుతుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

సీజనల్ వ్యాధుల ముప్పు

మున్సిపాలిటీల్లో డ్రెయినేజీలు మురుగునీటితో అస్తవ్యస్తంగా మారడంతో ప్రజలను సీజనల్ వ్యాధుల ముప్పు వెంటాడుతోంది. ఇళ్ల మధ్య మురుగు కుంటలు ఏర్పడడం, కొత్త కాలనీల్లో డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడం, విధిగా డ్రైనేజీలు శుభ్రం చేయకపోవడం, చెత్త తరలించకపోవడంతో దోమలు విజృంభిస్తున్నాయి. దోమకాటుతో ప్రజలు మలేరియా, డెంగీ, టైఫాయిడ్ జ్వరాల బారిన పడుతున్నారు. అంతేగాక, వర్షాలు పడుతుండడంతో పలు చోట్ల మిషన్ భగీరథ పైపులైన్‌లు లీకేజీలు కావడం, డ్రెయినేజీ నీరు తాగునీటి పైపుల్లోకి చేరడంతో డయేరియా వ్యాధులు వచ్చే అవకాశముందంటూ భయందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రత్యేక పాలనలో పట్టింపేది?

పేట మున్సిపాలిటీలో 24 వార్డులు, 55 వేలకుపైగా జనాభా, దాదాపు 9 వేలకు పైగా గృహాలు ఉన్నాయి. పాలకవర్గాల పదవీకాలం గతేడాది జనవరిలో ముగియడంతో ప్రత్యేకాధికారుల పాలన చేపట్టారు. 10 వేల మంది జనాభా ప్రాతిపదికన 28 మంది చొప్పున 154 మంది పారిశుద్ధ్య కార్మికులు ఉండాల్సి ఉండగా.. 82 మందితో కాలం నెట్టుకొస్తున్నారు. అరకొర సిబ్బందితో పట్టణం మొత్తం పారిశుద్ధ్య పనులు చేపట్టేందుకు ఇబ్బందులు తప్పడంలేదని అధికార యంత్రాంగం బహిరంగంగానే చెబుతుంది. రెండు రోజులకు ఒకసారి వార్డుల్లో చెత్త తొలగింపు, డ్రెయినేజీల శుభ్రం చేయాల్సి ఉండగా.. పక్షం రోజులకు ఒక సారి చేపడుతున్నట్లు జనం వాపోతున్నారు. ఇక బల్దియాలలో అభివృద్ధి పనులు, పారిశుద్ధ్యం, నీటి సరఫరా నిర్వహణను మెరుగుపర్చడంతో పాటు ప్రజా సమస్యలను పరిష్కరించడం, ప్రభుత్వ పథకాలను పకడ్బందీగా అమలు చేసేందుకు ప్రత్యేక అధికారులను నియమించింది. కానీ, ప్రత్యేక పాలకులు పట్టింపు లేకపోవడంతో పారిశుద్ధ్య సమస్య తీవ్రమైంది.



యాద్గిర్‌రోడ్డులో ప్రధాన రహదారి పక్కన మురుగుతో నిండిన డ్రెయినేజీ



పళ్ల ఏరియాకు వెళ్లే రహదారిలో డ్రెయినేజీ నిర్మించకపోవడంతో ఇదీ పరిస్థితి..

ముందస్తు చర్యలు చేపడతాం



పట్టణంలోని 24 వార్డుల్లో అంతర్గత, ప్రధాన రహదారులు, నివాస గృహాల ముందు ఉండే డ్రెయినేజీల్లో మురుగు, చెత్తను వారానికి ఒక సారి తొలగిస్తున్నారు. వర్షాకాలంతో ముందస్తుగానే ప్రధాన కాలువల్లో చెత్త, మురుగు తొలగింపజేస్తున్నాం. ఎక్కడైన సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తాం.

– భోగేశ్వర్, మున్సిపల్‌కమిషనర్, నారాయణపేట

'ప్రజావాణి' అర్జీలను త్వరగా పరిష్కరించాలి



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

నారాయణపేట: ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే ఫిర్యాదులకు ప్రాధాన్యతనిస్తూ వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులను ఆదేశించారు. ప్రజావాణి సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 46 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌కు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ ట్రైని కలెక్టర్ ప్రణయ్ కుమార్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పోలీస్ గ్రీవెన్స్‌కు 9 ఫిర్యాదులు

ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో 9 ఫిర్యాదులు అందాయి. ఎస్పీ యోగేష్‌గౌతమ్ నేరుగా ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ.. ప్రజా ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని, ఫిర్యాదులను ఎట్టి పరిస్థితుల్లో పెండింగ్‌లో ఉంచరాదని, ప్రజలకు తక్షణమే న్యాయం అందించి పోలీస్ వ్యవస్థ పై నమ్మకం భరోసా కలిగేలా విధులు నిర్వర్తించాలని అన్నారు.

సమగ్ర నివేదికలతో రండి

నారాయణపేట: అధికారులు సమగ్ర నివేదికలతో మంగళవారం జరిగే వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరు కావాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశించారు. సోమవారం కలెక్టర్ ఛాంబర్‌లో రాష్ట్ర ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు వీడియో కాన్ఫరెన్స్‌కు ఏసి (ఆర్), డి.డబ్ల్యూఓ, డీఈఓ, డీఎంహెచ్ఓ ఇతర శాఖల అధికారులు అన్ని నివేదికలను సిద్ధం చేసుకుని హాజరు కావాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ ట్రైని కలెక్టర్ ప్రణయ్ కుమార్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పనితీరు మార్చుకోకుంటే చర్యలు తప్పవు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి

నారాయణపేట: మున్సిపల్ అధికారులు పనితీరుపై ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి అసహనం వ్యక్తం చేశారు. సోమవారం నారాయణపేటలోని ప్రభుత్వ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ అధికారులతో ఎమ్మెల్యే సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అధికారులకు అనుకూలంగా పనిచేస్తున్నా, కొందరు అధికారులు పనులు చేయడం లేదని పనితీరు మార్చుకోవాలని లేకుంటే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారిందని, 100 రోజుల ప్రణాళిక కార్యక్రమం సరిగ్గా నిర్వహించడం లేదనే విషయం తన దృష్టికి వచ్చిందని, వార్డుల్లో ఫాగింగ్ చేయాలని, వీధి లైట్లు అమర్చి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా కార్యక్రమం పకడ్బందీగా అమలు చేయాలని కమిషనర్‌కు ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల గ్రౌండింగ్ త్వరగా చేయాలని, లబ్ధిదారులకు అవగాహన కల్పించి వారిలో ఉన్న అపోహలు తొలగించాలని వార్డ్ ఆఫీసర్లకు సూచించారు. ఇందిరమ్మ ఇంటి నిర్మాణం కోసం లబ్ధిదారులకు మహిళా సంఘాల ద్వారా ప్రత్యేక రుణం అందించేందుకు ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. నోటీసులు ఇచ్చి మరీ నల్లా బిల్లులు చెల్లించాలని ప్రజలను బలవంతం చేయొద్దని సూచించారు.

నాయకులను కలుపుకొని పోవాలి..

ఇదిలాఉండగా, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఎండీ సలీంతోపాటు పలువురు నాయకులు మాట్లాడుతూ.. కమిషనర్ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని, అభివృద్ధి పనులు చేపట్టడంలేదని, ఆయన పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇందిరమ్మ కమిటీ సభ్యులకు సమాచారం ఇవ్వకుండానే వార్డుల్లో అధికారులు మార్క్ అవుట్ లో ఇస్తున్నారని, కొత్తగా నిర్మించుకున్న గృహాలకు నెంబర్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. నాయకులను కలుపుకొనిపోవాలని, తప్పనిసరిగా ఇందిరమ్మ కమిటీ సభ్యులకు సమాచారం ఇచ్చి ఇళ్ల గ్రౌండింగ్ చేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ సమస్యలన్నీ నెల రోజుల్లో అధికారులు పరిష్కరించాలలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో హౌసింగ్ పిడి శంకర్, మున్సిపల్ కమిషనర్ భోగేశ్వర్, ఇంజనీర్ మహేష్, అధికారులు శ్రీనివాస్,లక్ష్మీ నర్సింహ, చెన్న కేశవులు, నాయకులు మార్కెట్ చైర్మన్ శివారెడ్డి, పట్టణ అధ్యక్షులు ఎండి. సలీం, నాయకులు గందే చంద్రకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ పగిలిన మిషన్ భగీరథ పైపులైన్



మరికల్ వద్ద మరమ్మతు చేసిన దగ్గరే మళ్లీ పగిలిన మిషన్ భగీరథ పైపులైన్

మరికల్: మన్యంకొండ మిషన్ భగీరథ నీటి శుద్ధి కేంద్రం నుంచి జిల్లాకు నీరు అందించే ప్రధాన పైపులైన్‌కు మరమ్మతు చేసి ఒక్క రోజు కూడా గడవక ముందే మళ్లీ పగిలింది. మరికల్, అప్పంపల్లి మధ్య తరచు లీకేజీ అవుతున్న ప్రధాన పైపులైన్‌ను మరమ్మతు చేయడం కోసం మిషన్ భగీరథ అధికారులు 36 గంటల సమయం తీసుకొని సిబ్బందితో మరమ్మతులు చేయించారు. ఆదివారం రాత్రి వరకు మరమ్మతులు పూర్తి కావడంతో అదే రాత్రి మన్యంకొండ గ్రిడ్ నుంచి నారాయణపేట జిల్లాకు నీటిని వదిలారు. అలా నీటిని వదిలిన గంట వ్యవధిలోనే మరికల్ శివారులో లీకేజీకి మరమ్మతు చేసిన ప్రదేశంలోనే మళ్లీ పైపులైన్ పగిలిపోవడంతో పెద్ద ఎత్తున పత్తి పంటల్లో నీరు వరదలా ప్రవహించడంతో చాకలి రాజు 3 ఎకరాల్లో సాగు చేసిన పత్తి మొక్కలు నీటి ప్రవాహానికి కొట్టుకుపోయాయి. దీంతో రూ. 50 వేల వరకు నష్టం వాటిల్లిందని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. జిల్లాకు మళ్లీ నీటి సరఫరా నిలిచిపోవడంతో పైపులైన్ మరమ్మతులు పనులు అధికారులు నాసిరకంగా చేస్తున్నారనంటూ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు.

జగన్నాథ పాహిమాం.. పురుషోత్తమ రక్షమాం

- జిల్లా కేంద్రంలో కనులపండువగా జగన్నాథ రథయాత్ర

నారాయణపేట టౌన్: జగన్నాథ పాహిమాం.. పురుషోత్తమ రక్షమాం.. అన్న ప్రార్థనలతో జిల్లా కేంద్రం మార్మోగింది. సోమవారం జిల్లా కేంద్రంలో జగన్నాథ రథయాత్ర మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ముందుగా ఉత్సవమూర్తులకు హారతి, పూజలు చేశారు. సరాఫ్ బజార్ బాలాజీ మందిరం నుంచి రథయాత్ర ప్రారంభమైంది. భక్తుల జై జగన్నాథ, హరేరామ్.. హరేకృష్ణ నామస్మరణతో పాలమూరు వీధులో మార్మోగాయి. జగమేలే జగన్నాథుడి రథయాత్ర దర్శనం కోసం భక్తులు భారీగా తరలివచ్చారు. రథన్ని లాగేందుకు జనం పోటీపడ్డారు. రథయాత్ర మెయిన్ చౌక్ మీదుగా సత్యనారాయణ చౌరస్తా వరకు నిర్వహించారు. మహిళలు బతుకమ్మ మాదిరిగా ఆడి పాడారు. పలు ధార్మిక సంస్థ సభ్యులు హాజరై రథయాత్రలో భాగంగా స్వయంగా తాడుతో రథాన్ని లాగారు. ఎమ్మెల్యే పర్ణికారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పర్ణికారెడ్డి



రథాన్ని లాగుతున్న భక్తులు

ఇసుక తరలించే ప్రయత్నాలు మానుకోవాలి



మాగనూర్ నుంచి ఇసుక తరలించవద్దని అధికారులను వేడుకుంటున్న రైతులు

మాగనూర్: ప్రభుత్వం,అధికారులు గ్రామస్తుల, రైతుల అంగీకారం లేకుండా ఇసుక తరిలించేందుకు ప్రయత్నిస్తే ప్రాణాలను సైతం లేక్క చేయమని అధికారులకు మాగనూర్ రైతులు గ్రామస్తులు హెచ్చరించారు. నారాయణపేట, కొడంగల్ ఎత్తిపోతల పథకంలో భాగంగా పైపుల తయారీ కోసం ఓ కాంట్రాక్టర్ కాంట్రాక్ట్ దక్కించుకున్నాడు. ఆయన మాగనూర్ గ్రామ సమీపంలోని హెచ్‌హెచ్–167 వంతెన పక్కనే ఇసుక తరలించేందుకు స్థానిక రెవెన్యూ అధికారుల సహాయంతో ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్తులు, రైతులు ఇక్కడ ఇసుక తరలిస్తే ఊరుకోం అన్ని ఈ నెల 27వ తేదీన వాగులోకి వచ్చిన యంత్రాలను టిప్పర్లను అడ్డగించి తిప్పి పంపించారు. అయినా అధికారులు మాత్రం వెనక్కి తగ్గకుండా అక్కడే ఇసుక తరలించేందుకు సోమవారం పోలీసు బందోబస్త్ ఏర్పాటు చేస్తున్న విషయం తెలుసుకున్న గ్రామస్తులు, రైతులు అధికారులు గ్రామస్తులను కాదని ముందుకు వెళితే మరో లగచర్ల, గద్వాల జిల్లాలోని ఘటనలు పునరావృతం అవుతాయని హెచ్చరించారు. దీంతో అధికారులు తహసీల్దార్ కార్యాలయంలో గ్రామస్తులు, రైతులతో శాంతి చర్చలు ఏర్పాటు చేశారు. అభివృద్ధి కోసం అందరి సహకారం ఉండాలని తహసీల్దార్ నాగలక్ష్మి, సిఐ రాంలాల్ కోరారు. గ్రామ సమీపంలో ఇసుక తరలిస్తే రైతుల పొలాలు ఎండిపోవడంతో పాటుగా గ్రామస్తులకు తాగునీరు లభించదని ఆవేదన వ్యక్తం చేశారు. మాగనూర్ మండలంలో పెద్ద వాగు ఇటు నేరడగం నుంచి అటు మందిపల్లి వరకు చాలా ప్రాంతాల్లో ఇసుక లభ్యం అవుతుందని అక్కడ నుంచి తరలించుకోవాలని సూచించారు. కాదని ఇక్కడే ఇసుక తరలించేందుకు ప్రయత్నిస్తే ప్రాణాలు పోయినా పిడికెడు ఇసుక కూడా ఇవ్వమని తేల్చి చెప్పారు. చేసేది లేక పనులకు కావాల్సిన ఇసుకను వర్కూర్ గ్రామం నుంచి 80 శాతం తరలిస్తామని తెలిపారు. మిగిలిన 20 శాతం ఇసుక సమయం వచ్చినప్పుడు ఎక్కడి నుంచి తరలించాలనే విషయంపై మేం నిర్ణయం తీసుకుంటామని తహసీల్దార్ తెలిపారు. ఈ సమావేశంలో మాగనూర్ గ్రామస్తులు, రైతులు , రెవెన్యూ అధికారులు, పోలీసులు తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

రెండు బైక్‌లు ఢీ : యువకుడి దుర్మరణం


చరణ్ (ఫైల్)

అయిజ: రెండు బైక్‌లు ఢీకొని ఓ యువకుడు మృతిచెందిన ఘటన మండలంలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాసరావు కథనం మేరకు.. మేడికొండకు చెందిన చరణ్ (26) ఆదివారం పట్టణం నుంచి స్వగ్రామానికి బైక్‌పై బయలుదేరాడు. అదే సమయంలో పుర పరిధిలోని తుపత్రాలకు చెందిన రమేష్ బైక్‌పై అయిజకు వస్తుండగా తుపత్రాల సమీపంలో రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో చరణ్‌కు గాయాలు కాగా అంబులెన్స్‌లో గద్వాల ప్రభుత్వ ఆస్పత్రికి.. మెరుగైన చికిత్స కోసం అర్ధరాత్రి కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతిచెందాడు. మృతదేహానికి అక్కడే పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించామని.. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


రాఘవేందర్ (ఫైల్)

వెల్దండ: రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం చెందిన సంఘటన సోమవారం కర్నూల్ జిల్లాలోని నంద్యాల–శ్రీశైలం జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. కుటుంబసభ్యుల వివరాల ప్రకారం.. వెల్దండ మండల కేంద్రానికి చెందిన బచ్చు రాఘవేందర్(34) కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నాడు. ప్రైవేట్ హెల్త్ ఇన్సురెన్స్ కంపెనీలో పాలసీ ఏజెంటుగా పనిచేస్తున్నాడు. నంద్యాలలో ఉంటున్న స్నేహితుడి వద్దకు తల్లి పద్మమ్మతో కలిసి వెళ్లాడు. తల్లిని స్నేహితుడి కుటుంబ సభ్యుల వద్ద ఉంచి రాఘవేందర్, స్నేహితుడు కారులో శ్రీశైలం వెళ్లారు. మార్గమధ్యలో కారు నిలిపి సోమవారం తెల్లవారు జామున 4 గంటల సమయంలో కాలకృత్యాల కోసం రోడ్డు దాటుతుండగా నంద్యాల–శ్రీశైలం జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో రాఘవేందర్ అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఈ విషయం తెలుసుకున్న వెల్దండలోని బంధువులు, కుటుంబ సభ్యులు సంఘటనా స్థలానికి వెళ్లారు. రాఘవేందర్ మృతి చెందడంతో స్వగ్రామంలో విషాదఛాయలు అములుకున్నాయి. అతనికి తల్లిదండ్రులు పద్మ, సత్యనారాయణ, అక్క రాజేశ్వరి ఉన్నారు.

విహారం.. విరామం!

- ఫర్హాబాద్ జంగల్ సఫారీ తాత్కాలికంగా నిలిపివేత
- నేటి నుంచి సెప్టెంబరు 30 వరకు నిషేధాజ్ఞలు
- అమ్రాబాద్ టైగర్ రిజర్వు(ఏటీఆర్)లో ఆంక్షలు
- జంతువుల సంతానోత్పత్తి సమయం.. నిబంధనలు కఠినం

అచ్చంపేట: నల్లమల 'అంటేనే ప్రకృతి రమణీయతకు నిలయం.. పక్షుల కిలకిలరావాలు.. జలపాతాలు.. వన్యప్రాణుల పరుగులు పర్యాటకులను పరవశింపజేస్తాయి. పెద్దపులులు, చిరుతలు కనిపిస్తూ ఉత్సుకతను రేకెత్తిస్తాయి. ఈ ఏడాది ముందుస్తు వర్షాల నేపథ్యంలో నల్లమల అభయారణ్యం పచ్చతోరణంగా మారింది. జూలై, ఆగస్టు, సెప్టెంబరు మాసాలు క్రూరమృగాలకు సంతానోత్పత్తికి అనువైన కాలం.. ఈ సమయంలో వాటికి ప్రశాంతత అవసరం.. పర్యాటకులు సంచరిస్తే వాటి ఏకాంతానికి భంగం కలుగుతుంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని జూలై 1నుంచి సెప్టెంబరు 31వ తేదీ వరకు అటవీశాఖ అధికారులు పర్యాటక విరామాన్ని ప్రకటించారు. నల్లమల అందాలు, వన్యప్రాణులను వీక్షించాలనుకునే పర్యాటకులు మూడు నెలలు ఆగాల్సిందే. జిల్లా పరిధిలో పర్యాటక కేంద్రాలు, పుణ్యక్షేత్రాలు ఉన్నాయి. మన్ననూర్, పర్హాబాద్–వ్యూ పాయింట్ వరకు జంగిల్ సఫారీ సౌకర్యం ఉంది. నల్లమల కృష్ణా పరివాహక ప్రాంతంలో జంతువులకు ఇబ్బందులు కలగకుండా పర్యాటకులు, జంతు సందర్శకులను సందర్శించకుండా పర్హాబాద్ సఫారీని తాత్కాలికంగా మూసివేస్తారు. దీంతో నల్లమలలోని పర్హాబాద్, వ్యూ పాయింట్, చెంచుపెంటలను పర్యటించే అవకాశం ఉండదు. తిరిగి అక్టోబరు 1నుంచి సఫారీ టూర్ ప్రారంభంకానుంది. ఈ మార్గంలో ప్రయాణించేవారు, పర్యాటకులు మన్ననూర్‌లో విడిది చేసేందుకు మాత్రం అనుమతించనున్నారు. ప్రస్తుతం పశువుల కాపర్లు, ఇతరుల సాధారణ ప్రవేశాన్ని అడ్డుకుంటున్నారు.

నల్లమల అటవీ ప్రాంతం


మూడు నెలలపాటు నిషేధాజ్ఞలు

జూలై నుంచి సెప్టెంబరు వరకు పులులు, ఎలుగుబంట్లు, ఇతర జంతువుల సంతానోత్పత్తికి అనువైన రోజులు కావడంతో వాటి ఏకాంతంతకు భంగం కలుగొద్దని నిషేధాజ్ఞలు విధించారు. ఈమూడు నెలలపాటు అటవీప్రాంతంలోకి పర్యాటకులు, ఇతరులనెరినీ అనుమతించరు. ఈ తరుణంలో వన్యప్రాణులకు ఎలాంటి హాని తలపెట్టకుండా రాష్ట్ర అటవీశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లా అధికారులు మరింత సంరక్షణ చర్యలు తీసుకుంటున్నారు. జంతువుల కదలికలను సీసీ కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తారు. అదేవిధంగా అచ్చంపేట, కొల్లాపూర్ ప్రాంతాల్లో విస్తరించి ఉన్న నల్లమల ప్రాంతంలోని పర్యాటక ప్రాంతాలతోపాటు అక్క మహాదేవి గుహలకు వెళ్లే అవకాశం లేదు.

అతిపెద్ద టైగర్ రిజర్వు

రాష్ట్రంలో పేరుగాంచిన అడవులు నాగర్‌కర్నూల్ జిల్లా నల్లమలలోని ఏటీఆర్‌తోపాటు ఆదిలాబాద్ జిల్లాలోని కవ్వాల్ అడవులు ఉన్నాయి. ఇందులో దక్షిణ భారత దేశంలోనే అతిపెద్ద టైగర్ రిజర్వు ఫారెస్టుగా అమ్రాబాద్ అభయారణ్యం గుర్తింపు పొదింది. 2,611.39 చదరపు కి.మీ విస్తీర్ణంలో విస్తరించి ఉండగా.. ఇందులో 2,166.37 చదరపు కి.మీ అభయారణ్యం కాగా 445.02 చదరపు కి.మీ బఫర్‌జోన్‌గా ఉంది. అభయారణ్యాల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాయి. అటవీశాఖ లెక్కల ప్రకారం నల్లమలలో మొత్తం 34 పెద్దపులులు ఉన్నాయి. వీటిలో 11 మగ పులులు, 15ఆడ పులులు, 8 చిన్న పిల్లలు(కబ్స్)ఉన్నాయి. 903 ప్రాంతాలు పెద్దపులుల అవాసాలుగా గుర్తించారు. వీటితోపాటు 170కిపైగా చిరుతలు, ఎలుగుబంట్లు, జింక లు, దుప్పులు, తోడేలు, అడవి కుక్కలు, జాకెల్, నీల్‌గాయ్, సాంబర్, చీతల్, నాలుగు కొ మ్ముల జింకలు, చింకార, అడవి పందులు, మాకాక్, చారల ఉడతలు, కుందేలు, మింగీసలు, అ డవి పిల్లి, గుడ్లగూబల తోపాటు పులులకు ఆహారంగా ఉపయోగపడే శాఖాహార జంతువులు, కీట కాలు ఇతర జంతువులు ఉన్నాయి.

పెద్దపులులు జతకట్టే సమయం

నల్లమల అడవులు, వన్యప్రాణులు అంతరించిపోతున్న సమయంలో వన్యప్రాణుల సంతతిని పెంచుటకు అటవీశాఖ 2018 తీసుకున్న నిర్ణయం సత్ఫలితాలు ఇవ్వడంతో ప్రతి ఏటా వర్షకాలంలో పర్యాటకుల కదలికలు లేకుండా ఆంక్షలు విధిస్తున్నారు. వన్యప్రాణులు ఏడాదంతా జతకట్టిన, ముఖ్యంగా పెద్దపులి జతకట్టు సమయం ఇదే. ఆడపులుల గర్భాదారణ సమయం 16వారాలు అయితే.. ఆడపులి గర్భాదారణ సమయంలో ఉన్నట్లు వాటి మూత్రవిసర్జన గుర్తుల ఆధారంగా మగ పులులు ఆకర్షించబడుతాయి. సాధారణంగా ఒక ఈతలో 3–4 పులి పిల్లలకు జన్మనిస్తాయి. వీటిని దట్టమైన అటవీ ప్రాంతాలు లేదా రాత్రిపగుళ్లు, నెరెలు ప్రాంతాల్లో పొదుగు చేసుకుంటాయి. ఆడపులి జీవిత కాలంలో సుమారుగా సమాన సంఖ్యలో ఆడ, మగ పిల్లలకు జన్మనిస్తుంది. ఆడపులులు సంతానోత్పత్తికి సిద్ధమయ్యే కాలం 3–4 సంవత్సరాలు కాగా.. మగ పులులు కాస్త ఆలస్యంగా 4–5 సంవత్సరాల కాలంలో సంతానోత్పత్తికి సిద్ధమవుతాయి.

పులులకు ఏకాంతం కల్పించేందుకు..



పులులకు ఏకాంత వాతావరణాన్ని కల్పించేందుకు అడవిలోకి ప్రవేశించకుండా పూర్తిస్థాయిలో నిషేధం విధిస్తున్నాం. ఇందుకు ప్రజలు, యాత్రికులు సహకరించాలి. అనుమతులు లేకుండా అడవిలోకి ప్రవేశించడంపై ఆంక్షలు నిరంతరం కొనసాగే ప్రక్రియ. జూలై నుంచి సెప్టెంబర్ వరకు పెద్దపులి జతకట్టే రోజులు కావడంతో మూడు నెలలపాటు యాత్రికులను అనుమతించడం లేదు. పర్హాబాద్ వ్యూ పాయింట్ సఫారీ సేవలు నిలిపివేశాం. ప్రధాన రహదారి గుండా వాహనదారులు 30కిలోమీటర్ల వేగం మించకుండా వెళ్లాలి.

– రోహిత్‌గోపిడి, జిల్లా అటవీశాఖ అధికారి

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరి అరెస్ట్

జడ్చర్ల: గంజాయిని చిన్నచిన్న ప్యాకెట్లుగా తయారు చేసి గుట్టుగా విక్రయిస్తున్న ఇద్దరు నిందితులను సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎక్సైజ్ సీఐ విప్లవరెడ్డి తెలిపారు. సీఐ కథనం మేరకు.. మండలంలోని మాచారం ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన మహేంద్ర పాల్, సత్యం ఎండు గంజాయిని ఆరు గ్రాముల ప్యాకెట్లుగా తయారు చేసి ఒక్కో ప్యాకెట్‌ను రూ.300కు విక్రయిస్తున్నారు. సమాచారం అందుకున్న తాము వారిపై దాడి చేసి అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 240 గ్రాముల గంజాయి తోపాటు రెండు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. దాడుల్లో ఎస్‌ఐ కార్తీక్‌రెడ్డి తదితర సిబ్బంది పాల్గొన్నారు.


నిందితులతో ఎక్సైజ్ సీఐ విప్లవరెడ్డి

కన్న కొడుకులు గెంటేశారు.. ఆదుకోండి సారూ...!



'కడుపున పుట్టిన పిల్లలు పట్టెడన్నం పెట్టకుండా ఇంటి నుంచి గెంటేశారు.. పైగా నా పేరున ఉన్న భూమిని కూడా లాక్కున్నారు' అంటూ 70 ఏళ్ల ఓ వృద్ధురాలు సోమవారం గద్వాల కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో కలెక్టర్ బీఎం సంతోష్‌కు ఫిర్యాదు చేసింది. వివరాల్లోకి వెళ్తే.. మల్దకల్‌కు చెందిన పావమ్మకు 4 కుమారులు. వృద్ధాప్యంలో అండగా నిలబడాల్సిన వారు ఆమె పేరిట ఉన్న 2.37 ఎకరాల భూమిని వారి పేరున రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. అంతేగాకుండా కనీసం రోజు భోజనం కూడా పెట్టకుండా ఇంటి నుంచి గెంటేశారు. తనకు న్యాయం చేయాలంటూ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసింది. – గద్వాల

భూగర్భ కేంద్రం సీఈగా కేవీవీ సత్యనారాయణ

దోమలపెంట: టీఎస్‌జెన్‌కో పరిధిలోని శ్రీశైలం ఎడమగట్టు భూగర్భ జల విద్యుత్ కేంద్రం చీఫ్ ఇంజినీర్‌గా కేవీవీ సత్యనారాయణ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన విద్యుత్ సౌధ, హైదరాబాద్‌లో ఎస్‌ఈ, జనరేషన్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ప్రమోషన్లు ఇవ్వొద్దని కోర్టులో స్టే ఉండడం వల్ల ఇన్‌చార్జి సీఈగా భూగర్భ కేంద్రానికి వచ్చారు. ఆయన జెన్‌కోలో సీనియర్ కావడంతో జెన్‌కో యాజమాన్యం ఈ బాధ్యతలు అప్పగించారు. ఈసందర్భంగా ఆయనకు భూ గర్భ కేంద్రం ఇంజినీర్లు ఘనంగా స్వాగతం పలికారు. ఇప్పటి వరకు కేంద్రం సీఈగా విధులు నిర్వహించిన కె.రామసుబ్బారెడ్డి పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఆయనకు కేంద్రం ఇంజినీర్లు, ఉద్యోగులు రామసుబ్బారెడ్డి సేవలను కొనియాడి ఘనంగా వీడ్కోలు పలికారు.


కేవీవీ సత్యనారాయణకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న రామసుబ్బారెడ్డి

గడ్డిమందు తాగి వృద్ధుడి ఆత్మహత్య

అడ్డాకుల: మండలంలోని గుడిబండ గ్రామానికి చెందిన మతిస్థిమితం లేని వృద్ధుడు గడ్డిమందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ ఎం.శ్రీనివాస్ తెలిసిన వివరాల ప్రకారం.. గుడిబండకు చెందిన సురేందర్ రెడ్డి(64)ని పెళ్లైన కొత్తలో భార్య వదిలేసి వెళ్లిపోయింది. అప్పటి నుంచి ఊరిలోనే ఉంటున్న సురేందర్‌రెడ్డి కొన్నాళ్ల నుంచి మతిస్థిమితం లేకుండా ఉంటున్నాడు. ఈక్రమంలో ఆదివారం ఇంట్లో ఉన్న గడ్డి మందును తాగాడు. కుటుంబ సభ్యులు జిల్లా కేంద్రంలోని ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. అతని సోదరుడు నరేందర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

నిందితులకు మూడేళ్ల జైలు

అలంపూర్: భర్త, అత్తమామలు వేధింపులకు గురిచేయడంతో మహిళ ఆత్మహత్యకు కారణమై నిందితులకు మూడేళ్ల జైలు శిక్ష, జరిమానా విధించిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ వెంకటస్వామి తెలిపిన వివరాల ప్రకారం.. అలంపూర్‌కు చెందిన శైలజకు ఇదే మండలం గుందిమల్ల గ్రామానికి చెందిన ఈశ్వరయ్యకు రెండేళ్ల క్రితం వివాహమైంది. ఏడాది క్రితం వారికి పాప పుట్టింది. కొంతకాలం అన్యోన్యంగా ఉన్నారు. తర్వాత భర్త, అత్తమామలు ఆమెను వేధింపులకు గురి చేశారు. వారి వేధింపులు తాలలేక శైలజ(28) కుమార్తెతో కలిసి కిరోసిన్ పోసుకొని నిప్పంటించుకొని ఆత్మహత్య చేసుకుంది. ఆమె తల్లి సావిత్రి 2015 అక్టోబర్ 17న ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఆ ఫిర్యాదు ఆధారంగా భర్త ఈశ్వరయ్య, మామ పెద్దయ్య, అత్త మునెమ్మలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు తెలిపారు. నేరం రుజువు కావడంతో 2023 మార్చిలో అలంపూర్ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి భర్త, అత్తమామలకు జైలుశిక్ష విధించారు. ఈ తీర్పును సవాల్ చేస్తూ నిందితులు పైకోర్టుకు వెళ్లారు. ప్రిన్సిపల్ జిల్లా కోర్టు జడ్జి ప్రేమలత కింది కోర్టు శిక్షణ సమర్థిస్తూ నిందితులకు 3 ఏళ్ల జైలు శిక్ష, ఒక్కొక్కరికీ రూ.500 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. నిందితులకు శిక్ష పడటానికి కృషి చేసిన డీఎస్పీ మొగిలయ్య, సీఐ రవిబాబు, అప్పటి అలంపూర్ ఎస్‌ఐ పర్వతాలు, ప్రస్తుత ఎస్‌ఐ వెంకట స్వామి, సహకరించిన పోలీసులను జిల్లా ఎస్పీ శ్రీనివాస్‌రావు అభినందించారు.

కనిపించే దైవం..

దేవుడు మనిషికి జన్మనిస్తే.. వైద్యుడు తన వైద్యంతో పునర్జన్మనిస్తాడు. వారి ఆత్మీయ స్పర్శ రోగికి అపరసంజీవని. అందుకే వైద్యో నారాయణో హరి అన్నారు పెద్దలు. ప్రతి ఒక్కరూ వైద్యుడిలో దేవుడిని చూస్తారు. అత్యవసర పరిస్థితుల్లో తమను నమ్ముకొని వచ్చే వారి ప్రాణాలను రక్షించడమే లక్ష్యంగా సేవలందించే దైవంగా అందరి మన్ననలు అందుకుంటున్నారు వైద్యులు. మంగళవారం జాతీయ డాక్టర్స్ డే సందర్భంగా ప్రత్యేక కథనం. – పాలమూరు




నేడు జాతీయ వైద్యుల దినోత్సవం

ఎంత గొప్ప వ్యక్తి అయినా.. పేదవాళ్లు అయినా చేతులెత్తి నమస్కరించేది కేవలం వైద్యులకు మాత్రమే. ప్రాణాపాయ స్థితిలో ఉన్నా.. ప్రమాదంలో గాయపడినా.. ఎలాంటి ఆపద వచ్చినా గుర్తుకు వచ్చేది వైద్యులే. ప్రస్తుత పరిస్థితుల్లో ఆహారం, వాతావరణంలో వస్తున్న మార్పుల కారణంగా కొత్త కొత్త వ్యాధులు వస్తున్నాయి. రోజుకు వేల మంది రోగులకు వైద్యులు వివిధ రూపాల్లో సేవలు అందిస్తున్నారు. కొందరు వైద్యులు మానవత్వంతో అభాగ్యులకు సేవలందిస్తూ తమ వృత్తిని కొనసాగిస్తున్నారు. మరికొందరు వృతి ధర్మానికి కట్టుబడి మానవతా విలువలతో వైద్యసేవలు అందిస్తున్నారు.

■ మహబూబ్‌నగర్ ప్రభుత్వ మెడికల్ కళాశాల 2016లో ప్రారంభం కాగా.. ఇప్పటి వరకు మూడు బ్యాచ్‌ల విద్యార్థులు వైద్యవిద్యను పూర్తిచేసుకున్నారు. 2016, 2017, 2018 సంవత్సరాల్లో 150మంది చొప్పున మొత్తం 450మంది ఎంబీబీఎస్ పూర్తిచేసుకొని బయటకు వెళ్లారు. ప్రస్తుతం 2019 బ్యాచ్‌లో 175మంది హౌజ్ సర్జన్లుగా జనరల్ ఆస్పత్రిలో పనిచేస్తున్నారు. 2020 నుంచి ప్రతి బ్యాచ్‌లో 175 మందికి అడ్మిషన్లు కల్పిస్తున్నారు. 2025–26 విద్యా సంవత్సరానికి కొత్తగా మరో 175మందికి అవకాశం కల్పించారు.

కరోనా సమయంలో ఇంటింటికెళ్లి..



కరోనా సమయంలో ఇంటింటికెళ్లి చికిత్స అందించడం, ప్రతి ఒక్కరికీ ధైర్యం కల్పించడం నా జీవితంలో మరిచిపోలేను. నేను 2014లో కర్నూలులో ఎంబీబీఎస్ పూర్తిచేశా. 2017లో సర్వీస్‌లోకి వచ్చాను. మొదట మిడ్జిల్‌లో మెడికల్ ఆఫీసర్‌గా విధుల్లో చేరాను. డెంగీ, చికున్‌గున్యా వంటి సీజనల్ వ్యాధులను కట్టడి చేయడానికి ప్రత్యేక వైద్యశిబిరాలు ఏర్పాటు చేస్తున్నాం.

– డా.శివకాంత్, మెడికల్ ఆఫీసర్, మిడ్జిల్

ప్రతి గ్రామానికి వెళ్లి సేవలు..



కొల్లాపూర్ ఏరియాలో ఉన్న ప్రతి గ్రామానికి వెళ్లి వైద్యసేవలు అందించా. ఓ అమ్మాయి డెంగీ బారినపడి పరిస్థితి ఇబ్బందిగా ఉండగా.. ఆమె ఇంటికి వెళ్లి పర్యవేక్షించాను. నేను 2015లో కడప రిమ్స్‌లో ఎంబీబీఎస్ పూర్తిచేశాను. ఆ తర్వాత ఎన్ఆర్‌సీ, హైదరాబాద్ బస్తీ దవాఖానలో, కొల్లాపూర్‌లో పనిచేశాను. గతేడాది జనవరి 1నుంచి ఇక్కడ సివిల్ అసిస్టెంట్ సర్జన్ క్యాడర్‌లో ఆర్ఎంఓగా పనిచేస్తున్నాను. మంచి గైనకాలజిస్ట్‌గా గుర్తింపు తెచ్చుకోవాలని ఉంది. – డా.శిరీష, ఆర్ఎంఓ, జిల్లా జనరల్ ఆస్పత్రి


ప్రసవాలపై ప్రత్యేక దృష్టి..



నేను దామరగిద్ద మెడికల్ ఆఫీసర్‌గా వచ్చిన తర్వాత ప్రతినెలా 15 కాన్పులు చేస్తున్నాం. ఈ నెలలో 26 సాధారణ కాన్పులు చేశాం. గర్భిణులకు మెరుగైన వైద్యం అందిస్తూ.. సాధారణ ప్రసవాలు జరిగేలా ప్రత్యేక దృష్టి సారించాం. 2016లో ఎంబీబీఎస్ పూర్తిచేసిన తర్వాత హైదరాబాద్‌లో పనిచేశాను. దామరగిద్దకు డిసెంబర్‌లో వచ్చాను. గతంలో ప్రతినెలా ఐదు వరకు మాత్రమే సాధారణ కాన్పులు జరిగేవి.

– డా.సుదీప్త, మెడికల్ ఆఫీసర్, దామరగిద్ద

ఏడాదిలో 315 సాధారణ కాన్పులు..



ఏడాది కాలంలో దేవరకద్ర పీహెచ్‌సీలో 315 సాధారణ కాన్పులు చేశాం. సాధారణ ఓపీతో పాటు ప్రసవాలపై ఎక్కువగా దృష్టి పెట్టాను. పీహెచ్‌సీల వారీగా పరిశీలిస్తే.. జిల్లాలో అత్యధిక కాన్పులు ఇక్కడే అవుతాయి. హైరిస్క్ ఉన్న కేసులను సైతం బాధ్యతగా తీసుకుని ప్రసవాలు చేస్తున్నాం. నేను 2015లో ఎంబీబీఎస్ పూర్తిచేశాను. ఆ తర్వాత లట్టుపల్లి, బిజినేపల్లి, కోయిల్‌కొండ, మహబూబ్‌నగర్‌లో పనిచేశాను. ప్రస్తుతం దేవరకద్రలో పనిచేస్తున్నా. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందిస్తున్నాం.

– డా.శరత్‌చంద్ర, దేవరకద్ర పీహెచ్‌సీ